
సాక్షి
కర్నూలు
గురువారం । 16 । నవంబర్ । 2023



సాక్షి గణపతికి విశేష పూజలు
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



మూగజీవులకూ హెల్త్ కార్డులు
మూగజీవాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులు జారీ చేస్తోంది. ఈ ప్రక్రియకు పశుసంవర్ధక శాఖ అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. 8లో▸



యువతకు ఎంతో మేలు
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యువతకు మేలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం సిల్వర్‌జూబ్లీ కాలేజీలో సదస్సు నిర్వహించారు. 8లో▸

నష్టాల్లో 'మునగ'కుండా..



మునగ కాయలను చూపుతున్న ఈ రైతు పేరు కే ఆంజనేయులు. కర్నూలు మండలం నందనపల్లి గ్రామ వాసి. గతంలో వర్షాధారం కింద వివిధ పంటలు సాగు చేసినా నికరాదాయం అంతంతమాత్రంగానే ఉండేది. 2022-23లో ఉపాధి నిధులతో ఎకరాలో మునగ సాగు చేపట్టారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించారు. పెట్టుబడి ఖర్చులు పోగా రూ.1.60 లక్షల వరకు నికరాదాయం మిగిలిందని ఆంజనేయులు తెలిపారు.



ఈ చిత్రంలో కనిపించే రైతుపేరు కే వెంకటేశ్వర్లు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సన్నకారు రైతు. గతంలో ఉల్లి, కంది, శనగ వంటి వర్షాధారం పంటలు సాగు చేసేవారు. వర్షాధారం కింద పంటలు సరిగ్గా పండక నష్టాలు మూటగట్టుకున్నారు. 2022-23లో ఉపాధి నిధులతో ఒక ఎకరాలో మునగసాగు చేపట్టారు. రూ.90 వేలు సబ్సిడీ లభించింది. పీకేఎం-1 రకం మొక్కలు రాజమండ్రి నుంచి తెప్పించి నాటారు. తగిన యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులు పాటించడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. ఐదు నెలల్లోనే పంట చేతికి వచ్చింది. కిలోకు రూ.130 నుంచి రూ.150 వరకు ధర లభిస్తోంది. అన్ని ఖర్చులు పోగా ఎకరాపై నికరంగా రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది.

- మునగ సాగును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎకరాకు రూ.లక్ష వరకు సబ్సిడీ అందజేత
- ఉపాధి నిధులతో తోటల పెంపకం
- ఆరు నెలల్లోనే చేతికి వస్తున్న పంట
- నికరాదాయం వస్తుండటంతో రైతుల్లో ఆనందం



ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో సాగైన మునగ

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మునగ సాగు రైతులకు కలసివస్తోంది. తక్కువ నీటితో ఈ పంటను పండించుకోవచ్చు. గ్రామీణాభివృద్ధి శాఖ సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. దీంతో జిల్లాలో సాగు క్రమంగా పెరుగుతోంది. గతేడాది 105 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాది 236 మంది రైతులు 245 ఎకరాల్లో సాగు చేశారు. ఒక్కసారి మొక్కలు నాటుకుంటే ఈ పంట ఆరేళ్ల వరకు వస్తుంది. రక్తవృద్ధికి, రోగనిరోధక శక్తిని పెంచేందుకు మునగ దోహదపడుతోంది. దీంతో మార్కెట్‌లో ఈ పంటకు డిమాండ్ ఉంటోంది. జూన్, జూలైలో మొక్కలు నాటితే జనవరిలో కాపు వస్తుంది.

నర్సరీల ద్వారా మొక్కల సరఫరా
పీకేఎం-1 రకం మొక్కలతో గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక నర్సరీలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు మొక్కలు సరఫరా చేస్తున్నారు. ఈ రకం మొక్కలు 4-5 నెలలకే పూతకొచ్చి 6-7 నెలల్లో కోతకు వస్తున్నాయి. మొక్కకు 220 కాయలు వచ్చే అవకాశం ఉంది. కాయలు 75 సెంటీమీటర్ల పొడవు ఉండి 150 గ్రాముల బరువు ఉంటాయి. దీంతో రైతులు పీకేఎం-1 రకం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మునగ సాగుకు నీటి అవసరం కూడా తక్కువగా ఉంటుంది. త్వరగా కాపునకు వస్తుండటం, దిగుబడి ఎక్కువగా ఉండటం, మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో రైతులు మునగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జాబ్ కార్డు కలిగి ఐదు ఎకరాల లోపు సన్న, చిన్న కారు రైతులందరూ మునగ సాగుకు అర్హులే. కనిష్టంగా పావు ఎకరా నుంచి గరిష్టంగా ఎకరా వరకు ఉపాధి నిధులతో తోటలు సాగు చేసుకోవచ్చు. ఉపాధి హామీ పథకం కింద ఎకరాకు రూ.లక్ష వరకు దశల వారీగా చెల్లిస్తారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు
మునగ సాగును పెంచేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బంది మండలాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధి నిధులతో సాగు చేపట్టి చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఈ పంట నాటిన ఆరు నెలలోపే కాపు వస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మినహా మిగిలిన అన్ని మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా మండలాల్లో కుటుంబానికి అదనంగా 50 పనిదినాలు కల్పిస్తున్నారు. పనిదినాలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు మునగ సాగుకు పెద్దపీట వేస్తున్నారు.

సాగును ప్రోత్సహిస్తున్నాం



జిల్లాలో మునగ సాగును ప్రోత్సహిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకూ సబ్సిడీ ఇస్తున్నాం. గతేడాది పంట సాగు చేసిన రైతులు ఇప్పటికే రెండు సార్లు కాయలు కోశారు. ఈ ఏడాది సాగును మరింత పెరిగింది. పీకేఎం-1 రకం మునగ మొక్కలను సెంట్రల్ నర్సరీల్లో పెంచి రైతులకు సరఫరా చేశాం. మునగసాగుతో సన్న, చిన్నకారు రైతులకు నికర ఆదాయం లభిస్తోంది.
– అమరనాథరెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

జోరుమీదున్న మిర్చి ధర

- క్వింటా రూ.35,509

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిర్చి ధర మరింత జోరందుకుంది. ఈ నెల 14న అత్యధికంగా రూ.27,525 ధర లభించింది. తాజాగా బుధవారం రూ.35,509లకు చేరుకుంది. ఒక్క రోజులోనే క్వింటాపై రూ.8,257 పెరగడం విశేషం. 2023-24లో మిర్చి సాధారణ సాగు 24,319.2 హెక్టార్లు ఉండగా.. రికార్డు స్థాయిలో 59139.6 హెక్టార్లలో సాగయింది. ఈ ఏడాది సాగు చేసిన మిర్చి మొదటి కోతలు కొనసాగుతున్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు అమ్మకానికి 147 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ఠ ధర రూ.6,889, గరిష్ఠ ధర రూ.35,509 లభించగా.. మోడల్ ధర రూ.16,409 నమోదైంది.

➡ కాగా కందులకు రూ.9,819 ధర లభించింది. మార్కెట్‌కు కందులు కేవలం ఒక్క లాట్ మాత్రమే వచ్చింది.

➡ వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,899, ఉల్లిగడ్డలకు రూ.4,099, కొర్రలు రూ.5,719 ధర పలికాయి.

వలంటీర్ల ఎంపికకు నేడు నోటిఫికేషన్

కర్నూలు(అర్బన్): జిల్లాలో 95 గ్రామ, 77 వార్డు వలంటీర్ల ఎంపికకు ఈ నెల 16న జిల్లా కలెక్టర్ డా.జీ సృజన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యత గ్రామ/వార్డు సచివాలయాలపై ఉందన్నారు. ప్రజలకు, సచివాలయాలకు అనుసంధానకర్తలుగా(వలంటీర్లు) పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు స్వీకరిస్తామని, 21న దరఖాస్తుల పరిశీలన, 23న మౌఖిక పరీక్ష, 25న ఎంపికైన వారి వివరాలను వెల్లడిస్తామన్నారు. 28న శిక్షణ, 30వ తేదీ నుంచి విధులు నిర్వహించాల్సి ఉంటుందని సీఈఓ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

144 మంది టెక్నికల్ అసిస్టెంట్లకు స్థానాల కేటాయింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు 144 మంది సాంకేతిక సహాయకుల(టీఏ)కు కౌన్సెలింగ్ ద్వారా మండలాలు కేటాయించారు. కొద్ది నెలల క్రితం రేషనలైజేషన్‌లో భాగంగా టెక్నికల్ అసిసెంట్లు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు వెళ్లారు. వీరు తిరిగి ఉమ్మడి జిల్లాకు వచ్చారు. బుధవారం కౌన్సిలింగ్ ద్వారా మండలాలు కేటాయించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి నేతృత్వంలోని కమిటీ కౌన్సెలింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, డ్వామా పరిపాలన అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈసీకి పంచాయతీల వివరాలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల వివరాలను పంపుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాలు, రెవెన్యూ గ్రామాల వారీగా పూర్తి వివరాలను పంపించాలని ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎస్ఈసీ కోరిన విధంగా అన్ని గ్రామ పంచాయతీల వివరాలను పంపుతున్నట్లు డీపీఓ తెలిపారు.

40 శాతం సబ్సిడీపై వేరుశనగ పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నీటి ఆధారంపై సాగుకు 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లాకు 2,150 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను కేటాయించిన విషయం తెలిసిందే. తాజాగా ధరలు, సబ్సిడీలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాసెసింగ్, సంచి, ప్యాకింగ్, ఆర్‌బీకేలకు సరఫరా సహా క్వింటా పూర్తి ధర రూ.10వేలుగా నిర్ణయించింది. ఇందులో 40 శాతం అంటే రూ.4వేల సబ్సిడీ ఉంటుంది. రబీలో వేరుశనగను కర్నూలు, నందవరం, ఆస్పరి మండలాలకు మినహా మిగిలిన అన్ని మండలాలకు నీటి వసతిని బట్టి వేరుశనగను కేటాయించారు.

సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్) డాక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు రాష్ట్ర స్థాయిలో కీలక పోస్టు లభించింది. పశుసంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌గా ఈయన మంత్రాలయంలో నాలుగేళ్లు పనిచేశారు. తొమ్మిదేళ్ల పాటు కర్నూలు జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో టెక్నికల్ వీఏఎస్‌గా ఉన్నారు. 15 నెలలుగా విజయవాడలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి పేషీలో అడిషనల్‌గా సేవలందిస్తున్నారు. తాజాగా ఈయనను ప్రభుత్వం కీలకమైన సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్(ఎస్ఈఈడీ ఏపీ-సీడాప్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. విజయవాడలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా విధులు నిర్వహిస్తారు.

గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచుకోవాలి



పురాతన నాణేలను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ కె.మధుసూదనరావు

కర్నూలు కల్చరల్: గ్రంథాలయాల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని డీఆర్‌ఓ కె.మధుసూదనరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పుస్తక ప్రదర్శన, పురాతన నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనను ప్రారంభించిన డీఆర్‌ఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం జీవిత మార్గదర్శనానికి ఎంతో ఉపయుక్తమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ రంగనాథ్, అసిస్టెంట్ లైబ్రేరియన్లు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముసాయిదా జాబితాలో దొంగ ఓటర్లు ఉంటే గుర్తించి ఫిర్యాదు చేయాలని కోరారు. డబుల్ ఎంట్రీలు, సిమిలర్ ఫొటో ఎంట్రీస్ ఉన్నా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే విచారణ చేయించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముసాయిదా జాబితాపై ఉన్న అభ్యంతరాలను స్వీకరించేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్‌స్టేషన్‌లో ఓటు వేసేలా కేంద్రాలను కేటాయించాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదనరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోస్టర్ ఆవిష్కరణ
కర్నూలులో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడలకు సంబంధించి పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. పోటీలనిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘాల కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శేఖర్, ఎంఎండీ బాషా పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి
గూడూరు రూరల్: భూ సమస్యలకు సంబంధించి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. గూడూరులోని వైకేపీ కార్యాలయంలో గురువారం జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి 69 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి అర్జీకి నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని ఆమె అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆర్‌డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ వెంకటరమణ, నగర పంచాయతీ చైర్మన్ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైల్వేలైన్‌కు సర్వే
దూపాడు నుంచి బేతంచెర్ల వరకు ఓర్వకల్లు మీదుగా కొత్త రైల్వేలైన్ కోసం సర్వేను త్వరగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రైల్వే, ఏపీఐఐసీ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. దూపాడు నుంచి బేతంచెర్ల వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌లో జరిగే అభివృద్ధి పనులను తెలియజేస్తూ డీపీఆర్ ఓలో ప్రత్యేక పేజీలు ఉండాలన్నారు. రైల్వే అధికారులు కోరిక మేరకు దూపాడు రైల్వే స్టేషన్ దగ్గర గోదాము నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ..దిన్నదేవరపాడు దగ్గర ఉన్న రైల్వే క్రాసింగ్‌ను రోడ్డు అండర్ బ్రిడ్జిగా మార్చాలని కోరారు. సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ ఎం సోమశేఖరరెడ్డి, రైల్వే అధికారులు బాలాజీ, కిరణ్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సమగ్రాభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న మంత్రి జయరాం

ఆలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో మంగళవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం-1లో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును మండల కన్వీనర్ భీమప్ప చౌదరి ఆధ్వర్యంలో మంత్రి ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి గ్రామంలో తిరిగారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గత ప్రభుత్వానికి నేటి జగనన్న ప్రభుత్వానికి వ్యత్యాసం చూడాలని ప్రజలను కోరారు. గతంలో ప్రతి పథకంలోనూ అవినీతి, అక్రమాలు ఉండేవని, నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. పార్టీ కార్యకర్తలకు భోజనాన్ని మంత్రి జయరాం స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామి, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు



కానుకల లెక్కింపులో ఉద్యోగులు, శివసేవకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉభయ దేవాలయాల హుండీలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు మాట్లాడుతూ స్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాల హుండీల ద్వారా రూ.3,57,88,078 లభించినట్లు తెలిపారు. అలాగే కొంత విదేశీ కరెన్సీ కూడా లెక్కింపులో లభించిందన్నారు. ఈ ఆదాయం భక్తులు 34 రోజులలో సమర్పించినదన్నారు. హుండీల లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

18న పత్తికొండలో సామాజిక సాధికార యాత్ర

- పార్టీ జిల్లా పరిశీలకుడు రామసుబ్బారెడ్డి
- విజయవంతం చేయాలని పార్టీశ్రేణులకు పిలుపు



పత్తికొండలో సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పార్టీ పరిశీలకుడు రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు

పత్తికొండటౌన్: పత్తికొండలో ఈనెల 18వతేదీ శనివారం వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా పరిశీలకుడు పి.రామసుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సామాజిక సాధికార యాత్ర సన్నాహక సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మగౌరవం నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బీసీలను ఓటుబ్యాంకులా టీడీపీ వాడుకుందన్నారు. బస్సు యాత్ర రెండో విడతలో భాగంగా జిల్లాలో మొదటిసారి పత్తికొండలోనే ప్రారంభమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పత్తికొండపై ప్రత్యేక ప్రేమ ఉందన్నారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. అందరూ సమన్వయంతో కృషిచేసి, సామాజిక సాధికార బస్సుయాత్ర, బహిరంగసభ భారీ విజయవంతం చేయాలని కోరారు. 18వతేదీ శనివారం ఉదయం 11గంటలకు పత్తికొండ పట్టణం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని, నాలుగుస్తంభాల మంటపం నుంచి గుత్తిరోడ్డు సర్కిల్ వద్ద బహిరంగసభ నిర్వహిస్తారన్నారు. ఈ సభకు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషాశ్రీచరణ్, ఆదిమూలపు సురేష్, అంజాద్‌బాషాతో పాటు వెనుకబడిన వర్గాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ఎల్లోమీడియా, ప్రతిపక్ష టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీనాయకులు, కార్యకర్తలు గొంతుకగా పనిచేయాలని, ప్రజలకు వాస్తవాలను వివరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ పరిశీలకుడు రామసుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యతో కలసి పట్టణంలోని పాతబస్టాండు అంబేడ్కర్ సర్కిల్, ఊరివాకిలి సెంటర్, గుత్తిరోడ్డు సర్కిల్ వద్ద ప్రాంతాలను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీరంగడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ పక్కీరప్ప, జెడ్పీటీసీ సభ్యులు కేశ సుభాషిణి, మురళీధర్‌రెడ్డి, ఎంపీపీలు నారాయణదాసు, వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు సోమశేఖర్, భాస్కర్‌నాయక్, గంపల వెంకటేశ్వర్లు, రవిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీపీఆర్‌కు పంచాయతీ కార్యదర్శుల వివరాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల వివరాలు పంచాయతీ రాజ్ కమిషనరేట్ (సీపీఆర్)కు పంపుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ -6 వరకు విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, వారి పేర్లు, ఖాళీలతో సహా పూర్తి వివరాలను పంపించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే మూడు డివిజన్ల నుంచి వివరాలను తెప్పించుకొని సీపీఆర్‌కు పంపుతున్నట్లు డీపీఓ తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను దహనం చేస్తున్న దృశ్యం

హొళగుంద: వివిధ కేసుల్లో పట్టుబడి హొళగుంద పోలీసుస్టేషన్‌లో నిల్వ ఉన్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటుసారాను బుధవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. స్థానిక చిన్నహ్యాట రోడ్డులో రూ.2.20 లక్షల విలువ చేసే 5,713 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కించి నాశనం చేశారు. అలాగే నిప్పు పెట్టి దహనం చేశారు. కర్ణాటక మద్యం విక్రయించడం, అక్రమంగా తరలించడం చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కేసుల వల్ల జైలు పాలవడమే గాక తమ వాహనాలు సీజై స్టేషన్‌లోనే ఏళ్ల తరబడి ఉండి ఎందుకు పనికి రాకుండా పోతాయన్నారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

29, 30, డిసెంబర్ 3 తేదీల్లో మద్యం అమ్మకాలు బంద్

కర్నూలు(సెంట్రల్): తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు,కౌంటింగ్ రోజుల్లో సరిహద్దుల్లోని మద్యం దుకాణాల్లో అమ్మకాలు బంద్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో నవంబర్ 29, 30, డిసెంబర్3 తేదీల్లో మద్యం షాపులు బంద్ కానున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల సమీపంలో ఓ పొలం గట్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రేవనూరు ఎస్‌ఐ కల్పన తెలిపారు. బుధవారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు వ్యక్తి లుంగీతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వెళ్తున్న రైతులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుని ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9121101173, 9121101175 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తొలగనున్న 'దారి'ద్ర్యం

అడుగు తీసి అడుగు వేయలేనంతగా మొనతేలిన రాళ్లు.. వాహనాల్లో వెళ్లినా ఒళ్లు హూనమే. ఇక వాహనాల పరిస్థితి చెప్పనక్కరలేదు. పాట్లు విరిగిపోయి తరచూ షెడ్డుకు వెళ్లిరాక తప్పదు. రోజులు కాదు.. నెలలు కాదు.. ఏళ్లపాటు ఇదే రహదారిలోనే నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా గత పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రహదారి స్థితిని నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. రూ.21.50 కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఇక రహదారి సమస్య త్వరలోనే తొలగుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- కాశీరెడ్డి నాయన ఆశ్రమ రోడ్డుకు రూ.21.50 కోట్లు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



దుస్థితిలో ఉన్న క్రిష్ణగిరి-కాశిరెడ్డినాయన ఆశ్రమ రహదారి

బనగానపల్లె: మండల పరిధిలోని క్రిష్ణగిరి మెట్ల నుంచి కాశిరెడ్డినాయన ఆశ్రమం వరకు దాదాపు 18 కిలోమీటర్ల రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. దీంతో క్రిష్ణగిరితో పాటు చెర్లోకొత్తూరు మంగంపేట, మంగంపేట తండా నుంచి కాశీరెడ్డి నాయన ఆశ్రమానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గత ప్రభుత్వంలో టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి తీసుకెళ్లడంతో ఆయన ఇటీవల ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయూముల్లాతో కలిసి రహదారిని పరిశీలించారు. పరిస్థితిని వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు రూ.21.50 కోట్లు మంజూరు చేశారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఈఎన్‌సీ పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే క్రిష్ణగిరి నుంచి చెర్లోకొత్తూరు, మంగంపేట, మంగంపేట తండా నుంచి కాశీరెడ్డి నాయన ఆశ్రమం వరకు ప్రయాణం సులభవుతుంది.

టీడీపీ నాయకులు పట్టించుకోలేదు



రహదారి బాగు చేయించాలని చెప్పినా గత ప్ర భుత్వంలో టీడీపీ నాయకులు పట్టించుకోలేదు. ప్రయాణం చేయాలంటేనే నరకం కనిపిస్తోంది. ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయంట. త్వరలోనే రోడ్డు వేస్తారని చెబుతున్నారు. రోడ్డు వేస్తే ప్రయాణ కష్టాలు తొలగిపోతాయి.

– చిన్నప్పురెడ్డి, చెర్లో కొత్తూరు

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఈ రహదారి సమస్యతో క్రిష్ణగిరి, చెర్లోకొత్తూరు, మంగంపేట, కాశిరెడ్డినాయన ఆశ్రమానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దారి అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి రుణపడి ఉంటాం. త్వరగా పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నా.

– ప్రసాద్, క్రిష్ణగిరి

నిధులు మంజూరు



ఈ రోడ్డు నిర్మాణానికి రూ.21.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. టెండర్లు పూర్తయిన తరువాత పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తాం.

– సునీల్‌కుమార్‌రెడ్డి, డీఈఈ, ఆర్‌అండ్‌బీ కోవెలకుంట్ల

వైఎస్సార్‌సీపీతో యువతకు ఎంతో మేలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



సదస్సుకు హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు

- మేయర్ బి.వై రామయ్య

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యువతకు ఎంతో మేలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. సదస్సుకు మేయర్‌తోపాటు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ , కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బెల్లం మహేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ప్రభుత్వ స్కూళ్లలో టాయిలెట్స్, తాగునీరు కూడా ఉండేవి కాదన్నారు. నేడు మన బడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా స్కూళ్ల రూపు రేఖలు మారాయన్నారు. విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంటింటికీ జాబ్ ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ హయాంలో మోసం చేశారని గుర్తు చేశారు. వైస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలోనే 4 లక్షలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిందన్నారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తోందన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాటు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా విద్యలో నూతన సంస్కరణలు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విస్తృతంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. అన్ని ప్రాంతాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమానంగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో యువత మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ రోషన్ అలీ, సిల్వర్‌జూబ్లీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కాలేజీ అధ్యాపకురాలు వినోలియా, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మణి రెడ్డి, నాయకులు సంతోష్, మధుసూదన్, అరుణ్, దీపక్, ధీరజ్, ఆర్.యూ విభాగం నాయకులు అఖిల్, సిధార్థ్, రాజావర్ధన్, చంటి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో 67వ రాష్ట్రస్థాయి అండర్-17 ఫెన్సింగ్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్, ఫైట్ ఇండియా స్టేట్ కో ఆర్డినేటర్ విశ్వనాథ్, ఎస్‌సీసీ అధికారి రవికుమార్, ఏపీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల రవికుమార్, ప్రభాకర్ మాట్లాడుతూ 13 ఉమ్మడి జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 50 మంది కోచ్‌ల్ పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్పీజీ పాఠశాల హెచ్‌ఎం జీవలత, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, రాష్ట్ర అబ్జర్వర్ భవాని, రాఘవ, వ్యాయామ ఉపాధ్యాయులు విజయామని, పద్మలత, రాణెమ్మ, శివమ్మ, లక్ష్మిప్రసన్న, రేణుక, నాగరాజు పాల్గొన్నారు.

మొబైల్ దుకాణాలపై విజి'లెన్స్'

- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- రూ.55 వేలు అపరాధ రుసుం విధింపు



కర్నూలులోని యూకాన్‌ప్లాజాలో ఉన్న మొబైల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు: నిర్ణీత ధరలకు మించి విక్రయాలు జరుపుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో మొబైల్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి నీలం పూజిత ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు నగరంలోని భూపాల్ కాంప్లెక్స్ పక్కనున్న యూకాన్ ప్లాజా సముదాయంలో ఉన్న మొబైల్ దుకాణాల్లో తూనికల కొలతల శాఖ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. పీవీఆర్, పార్వతి, మారుతి, ఎస్ఆర్, న్యూశ్రీను , కెఎస్, రామ్ డెక్, ఎస్‌ఎం, మహాలక్ష్మీ మొబైల్స్ దుకాణాల్లో విక్రయాలను తనిఖీ చేశారు. మొత్తం తొమ్మిది దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి లీగల్ మెటరాలజీ చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించి ఆయా దుకాణాదారులకు రూ.55 వేలు అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో సీఐ రామకృష్ణ, తహసీల్దార్ వెంకటనారాయణ, ఏఓ రూఫస్, లీగల్ మెటరాలజీ ఆఫీసర్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాప్‌లపై విజిలెన్స్ దాడులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్‌షాప్‌లపై బుధవారం విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 5 మెడికల్ షాపులపై చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాదా కలందర్ మాట్లాడుతూ విజిలెన్స్ సీఐలు, సునీల్‌కుమార్, నాగేంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని పలు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించామన్నారు. లైసెన్స్ లేని దుకాణాలు, కాలం చెల్లిన మందులు తదితర కారణాలతో పలు దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

సంపూర్ణ సామాజిక న్యాయానికి కులగణన



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ, బడుగు, బలహీన వర్గాల నేతలు

- జగనన్నకు జేజేలు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు సంపూర్ణ సామాజిక న్యాయం చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల గణనకు ఆదేశించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కుల గణనకు సై అన్న జగనన్నకు జేజేలు అంటు వైఎస్సార్‌సీపీకి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలను రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేసే ఏకైక నాయకుడు దేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆయా వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలన్ని ఏకమై తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవకాశవాద రాజకీయాలు చేస్తున్న తెలుగుదేశం తదితర పార్టీలను వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య, ఎస్సీ నాయకులు ముప్పసాని గాలిరాజు, మైనారిటీ నాయకులు నస్సూర్‌బేగ్, బీసీ మహిళా నాయకురాలు చంద్రకళ, వీఆర్‌పీఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ, నాయకులు విజయలక్ష్మి, షఫీ, బోయ మధు, అర్జున్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవులకూ హెల్త్ కార్డులు

- ఆర్‌బీకేల వారీగా పంపిణీ
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- కార్డులో పూర్తి వివరాలు



గొర్రెలు/ మేకల ఆరోగ్య సంసరక్షణ కార్డు



రైతులకు అనిమల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆరోగ్యశ్రీ కార్డుల తరహాలో పశువులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులు(హెల్త్‌కార్డ్స్) జారీ చేస్తోంది. పంపిణీ ప్రక్రియకు పశుసంవర్ధక శాఖ బుధవారం శ్రీకారం చుట్టింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే పశునష్ట పరిహార పథకం ప్రారంభించింది. మరణించిన పాడిపశువు లు, సన్న జీవాలకు పరిహారం చెల్లిస్తోంది. ఈ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.20 కోట్లు పరిహారాన్ని అందజేశారు. కొద్ది నెలల క్రితమే వైఎస్‌ఆర్ పశుబీమా పథకాన్ని ప్రవేశ పెట్టి అన్ని రకాల పశువులు, జీవాలకు బీమా చేసుకునే సదుపాయాన్ని అమలు చేస్తోంది. తాజాగా పశువులు, జీవాలు కలిగిన ప్రతి కుటుంబానికి అనిమల్ హెల్త్‌కార్డుల జారీ చేస్తుండటం విశేషం.

టీకాల వివరాలు నమోదు..

పెద్ద పశువులు, సన్న జీవాలకు వేసే వ్యాధి నిరోధక టీకాల వివరాలు, సన్న జీవాలకు తాపే నట్టల నివారణ మందుల వివరాలు కార్డుల్లో నమోదు చేస్తారు. పశువైద్య సేవలు పొందడానికి ఈ కార్డును ఉపయోగిస్తారు. పశువులకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణ చర్యలు కృత్రిమ గర్భధారణ వివరాలను కార్డులో నమోదు చేస్తారు. పశువును అమ్మినా, కొనుగోలు చేసినా...ఈ వివరాలను కూడా కార్డులో నమోదు చేస్తారు. వైఎస్ ఆర్ పశు బీమా పథకం వివరాలను కూడా నమోదు చేయించుకోవాలి. పశువులకు అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో 1962 కాల్ చేసే విధంగా టోల్‌ఫ్రీ నంబరు ఉంటుంది. సన్న జీవాలకు అందించే వైద్య సేవల వివరాలను నమోదు చేస్తారు. పెద్ద పశువులకు, సన్న జీవాలను వేర్వేరు హెల్త్‌కార్డులు జారీ చేస్తారు. మొత్తంగా అనిమల్ హెల్త్‌కార్డులో పశువులు, సన్న జీవాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో 2,36,300 కుటుంబాలకు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2018 పశుగణన ప్రకారం 7,75,977 పశువులు, 25,96,531 సన్న జీవాలు ఉన్నాయి. 2,36,300 కుటుంబాలకు ఈ పశు సంపద ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ కుటుంబాలన్నిటికీ హెల్త్‌కార్డులు పంపిణీ చేయాలని పశుసంవర్ధకశాఖ నిర్ణయించింది. ఆరు పెద్ద పశువులకు ఒకటి ప్రకారం హెల్త్‌కార్డు జారీ చేస్తారు. ఒక కుటుంబానికి 15 పశువులు ఉంటే మూడు హెల్త్‌కార్డులు ఇస్తారు. 20 సన్న జీవాలకు ఒకటి ప్రకారం హెల్త్‌కార్డు ఇస్తున్నారు. ఒక రైతుకు 150 జీవాలు ఉంటే 8 హెల్త్‌కార్డులు జారీ చేస్తారు. ఉచితంగా హెల్త్‌కార్డులు జారీ చేస్తారు. అనిమల్ హెల్త్‌కార్డుల వల్ల కలిగే ఉపయోగాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఆరు నెలలు ఆపైన వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రైస్ కార్డు కలిగిన కుటుంబాలకు 80 శాతం రాయితీలో బీమా కల్పిస్తున్నారు. మరణించిన ప్రతి జీవానికి రూ.6,000 ప్రకారం పరిహారం చెల్లిస్తారు. ఒకటిన్నర సంవత్సరాలు పైబడిన మేలు జాతి(సంకరజాతి/దేశీయ) పశువులకు ఒక దానికి రూ.30వేలు. రెండు సంవత్సరాలు పైబడిన నాటు పశువులకు రూ.15వేల ప్రకారం పరిహారం చెల్లిస్తారు.

రైతులకు ఎంతో ప్రయోజనం



అనిమల్ హెల్త్‌కార్డులతో రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయి. ఒక కుటుంబంలో రెండు పశువులు ఉన్నా హెల్త్ కార్డు ఇస్తాం. హెల్త్‌కార్డుల్లో టీకాలు, నట్టల నివారణకు తాపే మందుల వివరాలు ఉంటాయి. ప్రస్తుతం కుటుంబానికి ఒకటి ప్రకారం హెల్త్‌కార్డులు వచ్చాయి. వీటిని ఆర్‌బీకే వారీగా పంపాం. రైతులకు కూడా పంపిణీ చేస్తున్నారు.

– డాక్టర్ రామచంద్రయ్య, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, కర్నూలు

రెండు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం ఉలిందకొండ నుంచి అక్రమంగా ఎర్రమట్టి (గ్రావెల్) తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఉలిందకొండ నుంచి కర్నూలుకు ఏపీ 39వీఏ 6369, ఏపీ 02 టీహెచ్ 2088 నంబర్లు గల టిప్పర్లతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రెండు టిప్పర్లను పట్టుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం వాటిని ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన స్పష్టం చేశారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురారి, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీశైల దేవస్థానం, జాతీయ సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ , దక్షిణ ప్రాంతీయ కేంద్రం బెంగళూరు వారి సంయుక్త నిర్వహణలో బుధవారం మోహినీఅట్టం ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ బాలకృష్ణ, సంపూర్ణ రాజ్యలక్ష్మి, సుప్రజ, సుందర్‌రాజన్, నాగసాయి తదితరులు నృత్యం చేశారు.కళాకారులకు దేవస్థానం ఈఓ డి పెద్దిరాజు ప్రశంసాపత్రాలను బహూకరించారు.